సాక్షి
మహబూబ్‌నగర్
మంగళవారం। 6। ఫిబ్రవరి। 2024



..పనులు పూర్తిచేయండి

ప్రసాద్ స్కీం పనులను పూర్తిచేయాలని టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అన్నారు.

వివరాలు 8లో ►



త్వరలోనే శుభవార్త

త్వరలోనే పేట ప్రజలు శుభవార్త వింటారని కాంగ్రెస్ నేత వంశీచంద్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ►

గరిష్ఠం/కనిష్ఠం
35.9 /16.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యుత్ సిబ్బందికి సహకరించండి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వం ప్రకటించిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ లబ్ధి పొందేందుకు ఇంటికి వచ్చే విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని ట్రాన్స్‌కో డివిజన్ ఆపరేషన్ డీఈ వెంకటశివరాం సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉచిత విద్యుత్ కోసం రేషన్‌కార్డు నంబర్, ఆధార్ నంబర్ ఇచ్చిన మీటర్ సర్వీస్ నంబర్‌కు లింక్ చేయించాలని సూచించారు. ఈ స్కీం కిరాయిదారులకు కూడా వర్తిస్తుందని, ఒక్క రేషన్ కార్డుకు ఒక గృహ సర్వీసుకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఒకవేళ బిల్లు రీడింగ్ సమయంలో అందుబాటులో లేని వారు ఆఫీసులో కూడా సర్వీస్ నంబర్‌కు రేషన్, ఆధార్ లింక్ చేయించవచ్చని తెలిపారు. అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలను అరికడదాం: ఎస్పీ



అడ్డాకుల: అందరూ రోడ్డు నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికడదామని ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు. మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజాలో సోమవారం 35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలకు ఆయన హాజరయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణపై నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. 18 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న వారు, డ్రైవింగ్ లైసెన్సు లేని వారు వాహనాలను నడుపొద్దని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణం కావొద్దని చెప్పారు. కారులో ప్రయాణించే వారు తప్పకుండా సీటు బెల్టు, బైక్‌పై వెళ్లేవారు తలకు హెల్మెట్ ధరించాలని తెలిపారు. రోడ్డు నిబంధనల గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మాసోత్సవాల సందర్భంగా టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి కంటి పరీక్ష చేయించుకున్నారు. రహదారిపై వెళ్లే వాహనాల వెనుక రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో శిక్షణ ఎస్పీ చిత్తరంజన్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ హిమాన్షు గుప్త, సీఐ రామకృష్ణ, ప్రాజెక్టు హెడ్ దీపా మాడియా, సంతోష్, బాలమురుగన్, రాకేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వినోద్ భరణి హాజరై ప్రసంగించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత, అవగాహన వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు శివలీల, సరితారాణి తదితరులు పాల్గొన్నారు.

కాంగి 'రేసు'లో మలుపులు!

లోక్‌సభ అభ్యర్థిత్వాల ఖరారుపై మల్లగుల్లాలు

- మహబూబ్‌నగర్ స్థానానికి ఫుల్ గిరాకీ
- ఏడుగురు అభ్యర్థుల దరఖాస్తు
- ఇప్పటికే ప్రచారం ప్రారంభించిన చల్లా
- తెరపైకి పారిశ్రామిక వేత్త మన్నె జీవన్‌రెడ్డి
- నేడు ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సమక్షంలో హస్తంలో చేరిక
- నాగర్‌కర్నూల్‌లోనూ ఆశావహుల పోటాపోటీ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రానున్న లోక్ సభ ఎన్నికల్లోనూ విజయం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ మేరకు పక్కా ప్రణాళికతో రూపొందించిన వ్యూహాలను అమలుపరుస్తోంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల్లో గెలుపు గుర్రాల కోసం అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా ఆశావహుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించడంతో పాటు మరోవైపు ఆయా అభ్యర్థుల బలాబలాలపై సర్వే నిర్వహించింది. ఇప్పటికే ఓ సారి సర్వే పూర్తి కాగా.. మరో దఫా ఇటీవలే ముగిసినట్టు తెలుస్తోంది. తాజా సర్వేలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ లో ఊహించిన అభ్యర్థిపై ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి అంతంతమాత్రంగానే సానుకూలత వ్యక్తమైనట్లు సమాచారం. దీంతో కంగుతిన్న అధిష్టానం మరింత పకడ్బందీగా ముందుకెళ్లాలని భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన పారిశ్రామికవేత్త మన్నె జీవన్‌రెడ్డి పేరు తెరపైకి రావడం చర్చనీయాంశంగా మారింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు ఆయన ఢిల్లీ వెళ్లారు.

ఏడుగురు ఆశావహులు..

కాంగ్రెస్ పార్టీ నుంచి పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు భారీసంఖ్యలో పోటీపడుతున్నారు. ఇప్పటికే దరఖాస్తులకు గడువు ముగియగా.. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి ఏడుగురు టికెట్ల కోసం అర్జీ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. వీరిలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డితో పాటు ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీలకు చెందిన డైరెక్టర్ మన్నె జీవన్‌రెడ్డి, బీసీ నాయకులు సంజీవ్ ముదిరాజ్, ఎన్పీ వెంకటేష్‌తో పాటు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి, వనపర్తి జిల్లాకు చెందిన మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి తనయుడు డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి, ఇదే జిల్లాకు చెందిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు.

> "సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వారు కాగా.. ఈ పార్లమెంట్ స్థానానికి ఆయనే కో ఆర్డినేటర్‌గా ఉన్నారు. ఈ పార్లమెంట్ స్థానంపై సీరియస్‌గా కన్నేసిన ఆయన గెలుపే లక్ష్యంగా పావులుకదుపుతున్నారు. సర్వేల ఆధారంగానే అభ్యర్థులను ఖరారు చేయాలని ముఖ్యమంత్రి భావిస్తుండగా.. ఇది ఎవరికి కలిసి వస్తుందనే అంశం పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇదే క్రమంలో చల్లా ఇటీవల బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణపై చేసిన కామెంట్లు, పాదయాత్ర సర్వే మేనేజ్‌మెంట్‌లో భాగమేననే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది."

తెరపైకి మన్నె జీవన్‌రెడ్డి



నవాబుపేట మండలం గురుకుంటకు చెందిన ఎంఎస్ఎన్ ఫార్మా డైరెక్టర్ మన్నె జీవన్‌రెడ్డి టీటీడీ బోర్డు సభ్యుడిగా సేవలందించారు. తనకు చెందిన పరిశ్రమలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని స్థానిక యువతకు సుమారు 20 వేల మందికి ఉపాధి కల్పించారనే పేరుంది. అంతేకాకుండా సామాజిక సేవాకార్యక్రమాలతో నిత్యం ప్రజల్లో ఉంటున్న ఆయన ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ లేదా జడ్చర్ల స్థానం నుంచి పోటీ చేయాలని భావించారు. బీఆర్ఎస్‌కు చెందిన సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి అన్న కొడుకు అయిన మన్నె జీవన్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి ఎంపీ స్థానం ఆశిస్తూ ఆయన దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం ఇచ్చిన హామీ మేరకు ఆయన మంగళవారం పార్టీలో చేరుతున్నారనే ప్రచారం జరుగుతోంది. స్థానికతతో పాటు బలమైన అభ్యర్థి కావడంతో జీవన్‌రెడ్డి వైపే హస్తం అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు పార్టీ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

వ్యూహాత్మకంగా 'చల్లా' పావులు..

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన చల్లా వంశీచంద్ రెడ్డి కాంగ్రెస్‌లో జాతీయస్థాయిలో కీలక స్థానంలో ఉన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా కొనసాగుతున్న ఆయన ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి పోటీ చేయాలని భావించారు. అధిష్టానం సూచనల మేరకు కసిరెడ్డి నారాయణరెడ్డికి టికెట్ త్యాగం చేయడంతో పాటు ఆయన గెలుపు కోసం శ్రమించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నుంచి మాత్రం బరిలో ఉంటానని అప్పుడే ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ముందస్తుగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ప్రచారం మొదలుపెట్టారు. ఇప్పటికే ఈ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీల ఎమ్మెల్యేలతో కలిసి కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఇటీవలే 'పాలమూరు న్యాయ్‌యాత్ర' పేరుతో నారాయణపేట జిల్లా నుంచి పాదయాత్ర ప్రారంభించారు.

నాగర్‌కర్నూల్‌లో 26 మంది..

ఎస్సీ రిజర్వ్ స్థానమైన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి కాంగ్రెస్‌లో పోటీచేసేందుకు పెద్ద ఎత్తున ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు మొత్తం 26 మంది కాంగ్రెస్ నేతలు ఈ స్థానం నుంచి ఎంపీ టికెట్ కోసం గాంధీభవన్‌లో దరఖాస్తులు సమర్పించినట్లు సమాచారం. వీరిలో ప్రధానంగా ఢిల్లీలో ప్రభుత్వ అధికార ప్రతినిధి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవితో పాటు ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మందా జగన్నాథం, నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన టీపీసీసీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య, కొణిదెల రాము తదితరులు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. అటు జనరల్ స్థానమైన మహబూబ్‌నగర్, ఇటు ఎస్సీ రిజర్వ్ స్థానమైన నాగర్‌కర్నూల్ లోక్‌సభకు ఆశావహుల నుంచి తీవ్రపోటీ ఉన్న నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఎవరివైపు మొగ్గుచూపుతుందనే అంశం సర్వత్రా ఆసక్తి రేపుతోంది.

ఇబ్బందులు తలెత్తకుండా గ్రామపాలన



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రత్యేకాధికారులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీల్లో పాలన నిర్వహించాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పంచాయతీ ప్రత్యేక అధికారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పంచాయతీ నిర్వహణను సాధారణంగా తీసుకోవద్దని, పంచాయతీల సక్రమ నిర్వహణకు సీనియర్ అధికారులను సైతం పంచాయతీ అధికారులుగా నియమించామని, ప్రత్యేక అధికారులు సర్పంచ్‌ల కన్నా ఇంకా జాగ్రత్తగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఈ నెల 7 నుంచి చేపట్టనున్న ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాలలో తాగునీటికి ఇబ్బంది రాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని, ముందు నుంచే సరైన విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని చెప్పారు. గడిచిన నాలుగైదు ఏళ్లలో గ్రామంలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు వచ్చినట్లయితే వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై విశ్లేషణ చేయాలన్నారు. అలాగే ఆర్థిక అంశాలపై పూర్తి జాగ్రత్తగా ఉండాలని, ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ విషయమై నియోజకవర్గ ప్రత్యేకాధికారులతో మాట్లాడడమే కాకుండా, గ్రామస్థాయిలోని అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బందిని భాగస్వామ్యం చేసి మంగళవారం ఒక అవగాహన సమావేశాన్ని నిర్వహించాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌లో భాగంగా శానిటేషన్‌తో పాటు, తాగునీరు, సాంఘిక దురాచారాలపై అవగాహన కల్పించాలని కోరారు. డీఆర్‌డీఓ యాదయ్య ఉపాధి హామీ పథకం నిర్వహణ, రిజిస్టర్లు గురించి వివరించగా, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరమణ ఇంట్రా వాటర్ సరఫరా, నీటి క్లోరినేషన్, నీటి వనరులను శుభ్రపరచడం, రిజిస్టర్ల నిర్వహణపై వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు పంచాయతీరాజ్ చట్టం, స్టాండింగ్ కమిటీలు, ప్రత్యేక అధికారుల విధులు, బాధ్యతలు, సమావేశాల నిర్వహణ, కార్యదర్శుల బాధ్యతలు, విధులు, లేఅవుట్ల నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ తదితర అంశాలపై వివరించారు.

పీఎం విశ్వకర్మయోజనపై 13న సదస్సు

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి లబ్ధిదారులను నమోదు చేయించాలని కలెక్టర్ రవినాయక్ కోరారు. ఇందుకుగాను ఈనెల 13న సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై సోమవారం సమావేశంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ శ్రీనివాసరావు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం విధివిధానాలను వివరించారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రజావాణిలో విన్నవిస్తున్న ఫిర్యాదులు, వినతులను సకాలంలో పరిష్కరించి న్యాయం చేయాలని కలెక్టర్ రవినాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ జ్యోతితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పింఛన్లు, ఉద్యోగం, ఉపాధి, భూముల సమస్యలపైనే ఎక్కువగా ఫిర్యాదులు, వినతులు సమర్పించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులు జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఇదేవిధంగా మండల, గ్రామస్థాయిలో సైతం పరిష్కరిస్తే ఫిర్యాదుదారులకు ఆలస్యం లేకుండా పనులవుతాయని అన్నారు.

పీయూ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు



పీయూ డైరీని ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈ నెలాఖరులో పాలమూరు యూనివర్సిటీ స్నాతకోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా ఏప్రిల్‌లో న్యాక్ బృందం పీయూను సందర్శించనున్న నేపథ్యంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన నిర్ణయాలు కౌన్సిల్ సమావేశంలో తీసుకున్నట్లు తెలిసింది. గతంలో ప్రతి ఏడాది నాన్‌టీచింగ్ సిబ్బందికి 12శాతం వేతనం పెంచేవారు. రెండేళ్ల కిందట ఆ విధానాన్ని ప్రస్తుత వీసీ నిలిపివేశారు. ఈ క్రమంలో వేతనం పెంపుపై కౌన్సిల్ సమావేశంలో చర్యలు తీసుకుంటారని నాన్‌టీచింగ్ సిబ్బంది భావించగా.. ఈ సారి కూడా అధికారులు నిరాశే పరిచారు. కౌన్సిల్ సమావేశంలో పీయూ డైరీని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఆవిష్కరించారు. వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల కోసం ఉద్యమిస్తాం

నారాయణపేట: కృష్ణా జలాలను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ)కు అప్పగిస్తే మొదటగా నష్టపోయేది పాలమూరు ప్రజలేనని.. కృష్ణా జలాల కోసం ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేఆర్ఎంబీతో మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలపై ప్రభావం పడుతుందన్నారు. మనకు మంచి నీళ్లు కావాలంటే వాళ్లను అడగాల్సి ఉంటుందన్నారు. ఆ కార్యాలయంలో ఆంధ్రాలోని విజయవాడలో ఉంటుందన్నారు. ఇప్పుడు కోయిల్‌సాగర్‌కు నీళ్లు కావాలంటే రెండు మోటార్లు ఆన్ చేస్తే నేరుగా కాలువల ద్వారా నీరు వస్తుంది. అదే కేఎంఆర్‌బీ పరిధిలోకి వెళితే తాగేందుకు, సాగునీటికి అనుమతులు తీసుకురావాల్సి వస్తుందన్నారు. ఇదిలాఉండగా, పార్టీలో గతంలో జరిగిన తప్పులు సరిదిద్దుకొని ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పార్టీ వీడే వాళ్లను సాగనంపాలని, నిజాయితీగల కార్యకర్తలకు నష్టం జరగకుండా చూసుకుందామన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా టికెట్ ఎవరికి ఇచ్చిన గెలిపించి పార్లమెంట్‌కు పంపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు ఇంతియాజ్ ఇసాక్, దేవరి మల్లప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, విఠల్‌రావు ఆర్యా పాల్గొన్నారు.

కృష్ణాజలాల వాటా తేల్చకపోవడం శోచనీయం

- తెలంగాణ జనసమితి వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ కోదండరాం

కల్వకుర్తి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్నా కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా తేల్చకపోవడం శోచనీయమని తెలంగాణ జనసమితి వ్యవస్థాపకుడు ప్రొ.కోదండరాం అన్నారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 ఏళ్ల పాటు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి కృష్ణాజలాల వాటా తేల్చకపోవంతో ఆంధ్ర ప్రాంతవాసులు దోచుకుపోయారన్నారు. గత ప్రభుత్వం జలదోపిడీని ప్రశ్నించడం మరిచిపోయి.. అతిథి మర్యాద చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కల్వకుర్తి ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఉద్యమంలో భాగంగా కల్వకుర్తి ప్రాంతానికి వచ్చినప్పుడు ప్రజలు చూపిన ఆదరణ ఎప్పటికీ మరిచిపోలేనిదన్నారు. కాగా సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానం అమలుచేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నెరవేర్చేలా చూడాలని డివిజన్ నాయకుడు లక్ష్మీనర్సింహారావు కోరారు. అనంతరం సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అదేవిధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలయ్యేలా చూడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ ఆధ్వర్యంలో కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీజేఏసీ చైర్మన్ సదానందంగౌడ్, ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

సారు రూటే.. సపరేటు!

నర్సాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడి ఇష్టారాజ్యం

- అధికారులకు సమాచారం లేకుండా విధులకు డుమ్మా
- సొంతంగా ప్రైవేటు టీచర్ నియామకం.. ఆమెతోనే తరగతుల నిర్వహణ
- గతంలో విద్యాశాఖ అధికారులు హెచ్చరించినా మారని తీరు



నర్సాపూర్ పాఠశాలలో సోమవారం తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు టీచర్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: భావిభారత పౌరులకు మార్గదర్శనం చేయాల్సిన ఓ ఉపాధ్యాయుడు దారితప్పాడు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తూ.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అతడి తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని నర్సాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కొన్ని రోజులుగా పాఠశాలకు వెళ్లడం లేదని తెలుస్తోంది. పాఠశాలలో తరగతుల నిర్వహణ కోసం ఓ ప్రైవేటు టీచర్‌ను సొంతంగా నియమించుకున్నాడు. సాధారణంగా అధికారులకు సమాచారం ఇచ్చి సెలవు తీసుకుంటే.. ఏకోపాధ్యాయ పాఠశాలలకు ప్రత్యామ్నాయంగా మరో ఉపాధ్యాయుడిని కాంప్లెక్స్ హెచ్‌ఎం ఏర్పాటు చేస్తారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ పాఠశాలను మూసివేయడానికి అవకాశం లేదు. నర్సాపూర్ పాఠశాల ఉపాధ్యాయుడు అనుమతి తీసుకోకపోవడంతో పాటు స్వతహాగా నిర్ణయాలు తీసుకోవడం విద్యాశాఖ అధికారులను విస్మయానికి గురిచేస్తోంది. సదరు ఉపాధ్యాయుడు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న విషయంపై గతంలో 'సాక్షి'లో సైతం వార్తలొచ్చాయి. దీంతో సంబంధిత అధికారులు పలుమార్లు ఉపాధ్యాయుడిని హెచ్చరించినా మార్పు రాకపోవడం గమనార్హం.

ప్రైవేటు టీచర్ నియామకం..

నార్సాపూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడు తరచూగా ఉండటం లేదని, తరగతులు సరిగ్గా బోధించడం లేదని అధికారులకు ఫిర్యాదులు అందడంతో హెచ్చరికలు జారీచేశారు. దీంతో ఎక్కడా లేనివిధంగా ఓ ప్రైవేటు టీచర్‌ను సదరు ఉపాధ్యాయుడు నియమించుకున్నాడు. 7 నెలలుగా ప్రైవేటు టీచర్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెకు వేతనం సైతం ఉపాధ్యాయుడే ఇస్తున్నారు. జిల్లాకేంద్రం సమీపంలోని రాయచూరు ప్రధాన రహదారి పక్కనే ఉన్న పాఠశాలలో ఈ తతంగం కొనసాగుతున్నా ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఇతర అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్న తలెత్తుతోంది. ఈవిషయంపై సదరు ఉపాధ్యాయుడు శ్యాంసుందర్ వివరణ కోరగా.. 'నాకు గత నెల చివరన యాక్సిడెంట్ అయినందున పాఠశాలకు వెళ్లలేదు. సెలవు పత్రాన్ని వాట్సాప్ ద్వారా పంపిస్తే. కాంప్లెక్స్ హెచ్‌ఎం చూడలేదు. ఇబ్బంది రాకుండా ఉండేందుకు నేనే ప్రైవేటు టీచర్‌ని నియమించి వేతనం ఇస్తున్నా.' అని అంటున్నారు.

సమాచారం లేదు..

నర్సాపూర్ పాఠశాల ఉపాధ్యాయుడి నుంచి సెలవు పత్రం అందలేదు. సెలవు విషయాన్ని మా దృష్టికి తీసుకొస్తే ప్రత్యామ్నాయంగా ఒక టీచర్‌ను నియమించే వాళ్లం. వేరే వారిని స్వతహాగా నియమించుకునేందుకు అవకాశం లేదు. ఉపాధ్యాయుడికి ఫోన్ చేసినా స్పందించలేదు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కృష్ణయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం, ధర్మాపూర్

మెమో జారీచేస్తాం..

నర్సాపూర్ పాఠశాల ఉపాధ్యాయుడి వ్యవహారం మా దృష్టికి వచ్చింది. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించినా మార్పు రాలేదు. సెలవుపై ఎలాంటి సమాచారం లేదు. ప్రైవేటు టీచర్ నియామకం గురించి తెలియదు. సదరు ఉపాధ్యాయుడికి మెమో జారీచేసి, తదుపరి చర్యలు తీసుకుంటాం.

– జయశ్రీ, ఎంఈఓ, మహబూబ్‌నగర్ రూరల్, అర్బన్

తీవ్రంగా పరిగణిస్తున్నాం..



ఉపాధ్యాయుడు ప్రైవేటు టీచర్‌ను నియమించుకుని, కొన్ని రోజులుగా విధులకు హాజరు కావడం లేదన్న విషయం తెలిసింది. దీన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తున్నాం. పూర్తి స్థాయిలో విచారణ జరిపించి. సదరు ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

కందుల ధర రూ.10,100

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో సోమ వారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.10,100, కనిష్ఠంగా రూ.9,859గా నమోదయ్యాయి. వేరుశనగ గరిష్ఠంగా రూ. 6,400, కనిష్ఠంగా రూ. 6,336గా పలికాయి. ఆముదాల ధర గరిష్ఠంగా రూ.5,369గా ఒకే ధర లభించింది.

క్లుప్తంగా

రూ.1.85 లక్షల నగదు చోరీ

గద్వాల క్రైం: రెండు వేర్వేరు ఘటనల్లో నగదు ఎత్తుకెళ్లిన ఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ రెండవ ఎస్‌ఐ అబ్దుల్‌షకుర్ తెలిపిన వివరాలు ఇలా.. 2వ రైల్వేగేట్ కాలనీకి చెందిన గాండ్ల శివప్ప సోమవారం ఉదయం బ్యాంకులో నగదు డిపాజిట్ చేసేందుకు పోస్టాఫీస్‌లో నిల్వ ఉంచుకున్న రూ. 1.80లక్షలు, మరో బ్యాంకులో రూ.20వేల నగదును డ్రా చేసుకుని స్కూటీలో భద్రపరుచుకున్నాడు. డ్రా చేసిన నగదును ఓ ప్రైవేట్ బ్యాంకులో డిపాజిట్ చేసేందుకు వెళ్లాడు. స్కూటీలో భద్రపరచుకున్న రూ. 1.80లక్షల నగదును డిక్కీ తీసి చూడగా నగదు కనిపించక పోవడంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా సాయి హోంకాలనీలో నివాసం ఉంటున్న బండారు రమాదేవి కుటుంబసభ్యులు కలిసి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం ధ్వంసం చేసి బీరువాలో ఉన్న రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. ఇంటి తలుపులు తీసి ఉండడంతో స్థానికులు ఇంటి యాజమానికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంట్లో నగదు, బంగారం..

చారకొండ: ఇంట్లో నగదు, బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని జూపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రియాజ్ అదే గ్రామంలో మామ 2వ తేదీన చనిపోవడంతో రియాజ్ కుటుంబ సభ్యులంతా వారి ఇంట్లోనే ఉన్నారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించి రాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి బీరువాలో ఉన్న దాదాపు రూ.లక్ష నగదు, అరతులం బంగారం, 10 తులాల వెండిని ఎత్తుకెళ్లారు. 4వ తేదీ ఆదివారం ఉదయం రియాజ్ ఇంటికి రాగా, తలుపులు పగుల గొట్టి ఉండడం గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడంతో నగదు, బంగారం, వెండి అపహరించినట్లు గుర్తించారు. దీంతో ఆదివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్‌టీం చేరుకుని పరిశీలించారు. ఈ కేసు నమోదు చేసి ,దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సూపర్ మార్కెట్‌లో..

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్‌లో చోరీ జరిగిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పోలహరికృష్ణ సూపర్ మార్కెట్‌కు వెనుక వైపు ఉన్న తలుపును తెరిచి గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించారు. డ్రైఫ్రూట్‌లు, కిరాణ వస్తువులతో పాటుగా, రూ.50వేల నగదును ఎత్తుకెళ్లారని ఎస్‌ఐ తెలిపారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించామని, సూపర్‌మార్కెట్ యజమాని ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

పాన్‌గల్: మహిళ మెడలో గొలుసు చోరీ కేసులో ఇద్దరికి వనపర్తి కోర్టు సోమవారం జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. మండలంలోని చిక్కేపల్లికి చెందిన ముంత శశిరేకమ్మ 2020 సెప్టెంబర్‌లో ప్రధాన రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సు దిగి గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ చెందిన మొగిల్లా గోపాలకృష్ణ, వెంకటయ్య బైక్‌పై వచ్చి ఆమె కంట్లో కారం చల్లి మెడలోని బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. గొలుసు చోరీపై నమోదైన కేసుపై విచారణ అనంతరం సోమవారం ఇచ్చిన తీర్పులో 18 నెలల జైలు శిక్ష, రూ.3వేల జరిమాన విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన బిజినేపల్లి మండలంలోని పాలెంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకోగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు.. పాలెంకు చెందిన పుష్పలతను (32) తిమ్మాజిపేట మండలం రాళ్ల చెరువుతండాకు చెందిన గోపాల్‌గౌడ్‌తో 12ఏళ్ల క్రితం వివాహమైంది. పుష్పలత పాలెంలోని తండ్రి ఇంటి వద్దే నివాసం ఉంటుంది. భర్త గోపాల్‌గౌడ్ అనంతపూర్‌లో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ భార్య వద్దకు అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవాడు. ఇదే క్రమంలో పుష్పలత ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో అనుమానాస్పదస్థితిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతురాలి తండ్రి కృష్ణయ్యగౌడ్ తన కూతురు రెండేళ్లుగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుందని, భరించలేక ఆత్మహత్యకు పాల్పడిందని ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘ప్రసాద్ స్కీం’ పనులు పూర్తి చేయండి

- పరిశీలించిన పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్
- మ్యూజియంలోని విగ్రహాలను గుర్తించేలా బోర్డులు రాయించేందుకు రూ.5లక్షల నిధులు మంజూరు


పుష్కరఘాట్‌ను పరిశీలిస్తున్న శైలజారామయ్యార్, అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం: ప్రసాద్ స్కీం పనులను సోమవారం రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, టూరిజం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, ఆర్కియాలజికల్ డైరెక్టర్ భారతిహొళికేరి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆలయ పరిసరాలలో పర్యటించి పనులను పరిశీలించారు. యోగనారసింహ స్వామి ఆలయం వద్ద మూడు ఎకరాల స్థలంలో జీ ప్లస్–2తో నిర్మిస్తున్న అధునాతన భవనాన్ని పరిశీలించారు. ఇప్పటికే ఈ పనులు 60 శాతం పూర్తి కాగా, ఇప్పటిదాకా రూ.18కోట్ల52లక్షలతో పనులు పూర్తి చేశామని, ఇంకా రూ.7కోట్ల బిల్లులు రావాల్సి ఉందని దీంతో పనులు మందకొడిగా జరుగుతున్నాయని అధికారులు ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆమె భవన గదులను పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. రావాల్సిన బకాయిలు కూడా విడుదల అవుతాయని ఈ లోపు గ్రౌండ్ ఫ్లోర్ ముందు పూర్తి చేయాలని, అలాగే అప్రోచ్ రోడ్లు చేపడుతూ ఆలయం ముందు రోడ్డుకు అడ్డంగా ఉన్న ప్రహరి గోడ తొలగించాలని ఆదేశించారు. రూ.3కోట్లతో నిర్మిస్తున్న బస్టాండ్ వద్ద కల్వర్టు కోసం అదనంగా మరో రూ.కోటి అవసరమని పర్యాటక శాఖ ఇంజినీర్లు తెలపగా, టూరిజం నుంచి కాకుండా ఇరిగేషన్ లేదా కలెక్టర్ నిధుల నుంచి ఇప్పించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఎట్టి పరిస్థితిలో ఫిబ్రవరి 20లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

యోగనారసింహ స్వామి ఆలయ పరిశీలన

రాష్ట్ర పురావస్తు శాఖ, దేవాదాయశాఖ ఆధీనంలోని యోగనారసింహ స్వామి ఆలయాన్ని ఆమె సందర్శించారు. అతి పురాతనమైన ఈ ఆలయాన్ని పునరుద్ధరించాలని, ఈ ఆలయంలో బాగా లోతట్టు ప్రాంతంలో ఉండటంతో దీన్ని భూమి ఉపరితలం పైకి తీసుకుని పునర్నిర్మించాలని ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ కోరగా, మీ దేవాదాయశాఖ నిధులు ఇస్తుందా? అని ప్రశ్నించారు. దీంతో తమ శాఖలో నిధులు లేవని చెప్పగా తాను దేవాదాయశాఖ కమిషనర్‌తో మాట్లాడుతానని చెప్పారు.


దేవస్థానం సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇస్తున్న ఈఓ, చైర్మన్

అనంతరం మ్యూజియం వద్దకు వెళ్లి ఆమె ప్రదర్శనశాలను పరిశీలించారు. విగ్రహాలు ఎక్కడివి, చరిత్ర ఏమిటి విషయాలను వివరిస్తూ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేస్తే యాత్రికులు తెలుసుకోగలుగుతారని సూచించారు. ముందు ఆ పనులు పూర్తి చేయాలని, అందుకు అవసరమైతే మరో రూ.5లక్షల నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. అదే విధంగా అక్కడి టూరిజం గైడ్ తమ వేతనాల సమస్యను అధికారి దృష్టికి తీసుకురాగా, పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. చివరిగా ఆమె జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలను దర్శించి అక్కడ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ అన్నదాన సత్రం, ఆలయంలో చేపట్టాల్సిన చిన్నపాటి మరమ్మతు పనులు, అలాగే స్టాల్స్ వంటి వాటికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ చిన్నకృష్ణయ్య, టూరిజం జీఎం ఉపేందర్‌రెడ్డి, ఎస్‌ఈ మహ్మద్ సంయుద్దీన్, ఎలక్ట్రికల్ డీఈ శ్రీధర్, ఏఈ కల్యాణ్‌రెడ్డి, అధికారులు నారాయణ, మల్లునాయక్, ఏడీ నాగరాజు తదితరులు ఉన్నారు.

గురుకులలో గ్యాస్ సిలిండర్ లీక్

మరికల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వంటలు చేస్తుండగా గ్యాస్ సిలిండర్ లీకయ్యింది. సోమవారం మధ్యాహ్నం విద్యార్థులు భోజనం ముగించుకొని తరగతి గదులకు వెళ్లగానే, వంట మాస్టర్ తిప్పన్న సాయంత్రానికి సిలిండర్ వెలిగిచ్చి స్నాక్స్ చేస్తుండగా సిలిండర్ పైపు లీకేజీ అవ్వడంతో ఒక్కసారిగా మంటల చెలరేగాయి. అక్కడే ఉన్న మిగిత సిబ్బంది నిండు సిలిండర్లను బయటకు తీసుకొచ్చారు. విషయాన్ని వెంటనే సంబంధిత గ్యాస్ ఏజెన్సీకి సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు చేరుకుని గ్యాస్ బంద్ చేశారు. మంటలు పూర్తిగా ఆగిపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఘటనా స్థలానికి వచ్చిన అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనకు సంబంధించి వివరాలు సేకరించారు.


సిలిండర్‌కు అంటుకున్న మంటలు

మహిళలకు మనోధైర్యం



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న షీ టీం సిబ్బంది (ఫైల్)

- బాధితుల ఇళ్లను సందర్శిస్తూ.. ఆర్థిక చేయూత
- తక్షణ సాయం రూ.5వేల నుంచి రూ.10వేలు
- మహిళల భద్రత కోసం భరోసా కేంద్రం
- 101 మందికి రూ.28లక్షల నిధులు విడుదల

గద్వాల క్రైం: లైంగిక వేధింపుల బారిన పడిన మహిళలు ఎవరికి చెప్పుకోలేని స్థితిలో ఉన్న వారికోసం ప్రభుత్వం 2022లో జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మహిళల భద్రత కోసం భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. సమస్యల సుడిగుండాల నుంచి విముక్తి కల్పించేందుకు ఒకే గొడుగు కింద న్యాయ సలహా, వైద్యం, ఉపాధి, వసతితో పాటు కేసుకు సంబంధించిన పూర్తి ఆధారాలను సైతం సేకరించి దోషులకు చట్ట పరమైన శిక్ష విధించేలా జిల్లా పోలీసుశాఖ, భరోసా విభాగం కృషి చేస్తుంది.గద్వాల, గట్టు, ధరూర్, మానవపాడు, అలంపూర్, అయిజ, కేటీదొడ్డి, మల్దకల్, ఇటిక్యాల, శాంతినగర్, రాజోళి మండలంలోని లైంగిక వేధింపులకు గురైన 101 బాధితలకు చేయూత అందించింది. వారికి ఆర్థికమైన నిధులను కేటాయించి ఇప్పటి వరకు రూ. 28లక్షలు విడుదల చేశారు. తక్షణ సాయం కింద రూ.5వేల నుంచి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.

మహిళలకు మనోధైర్యం

మహిళల రక్షణ కోసం షీ టీంలను ఏర్పాటు చేసి బస్టాండ్, ప్రార్థన మందిరాలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో మహిళలతో అసభ్యంగా, అనుచితంగా వాఖ్యలు చేసిన వారిని వెంటనే షీ టీం సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు రక్షణగా నిలుస్తున్నారు. నిర్భయంగా ఫిర్యాదు చేసేలా మనోధైర్యాన్ని అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో డయల్ 100, 6303923257కు ఫోన్ చేసేలా చర్యలు తీసుకున్నారు. బాల్య వివాహాలు చేస్తున్న క్రమంలో 1098కు కాల్ చేయల్సిందిగా సిబ్బంది వివరిస్తున్నారు. యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ యూనిట్ కార్యాలయం ఏర్పాటు చేశారు. మైనర్లపై వేధింపులకు పాల్పడిన వారిపై పోక్సో చట్టం ద్వారా చర్యలు తీసుకుంటున్నారు. బాధిత కుటుంబాల ఇళ్లను సందర్శించి వారికి ఆర్థికపరమైన నిధులు అందజేస్తున్నారు. ఆర్థికంగా నిలబడేలా పలు ఉపాధి రంగాల్లో శిక్షణ అందించి ఆర్థిక అవకాశాలు కల్పిస్తున్నారు. నలుగురు విద్యార్థులను కేజీబీవీ పాఠశాలలో, 8 మంది విద్యార్థులను కళాశాలలో చేర్పించారు. టైలరింగ్, హ్యాండ్ లూమ్ వర్క్ తదితర వాటిలో శిక్షణ అందించారు.

ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు



మహిళలు, విద్యార్థినులు, చిన్నారులపై వేధింపులు, దాడులు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిపై ఎవరు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం, పట్టించుకునే ధోరణి, అభద్రతాభావం ప్రజల్లో ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేయాలంటే ముందుకురారు. అందులో భాగంగా ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుని షీ టీం, మహిళ చట్టలపై అవగాహన కల్పిస్తుంది. మహిళలకు భరోసా సెంటర్ ద్వారా వారిలో కొత్త అంశాలను వివరిస్తూ సమాజంలో ఎదురవుతున్న సమస్యలపై వివరిస్తున్నాం. ఆర్థికపరమైన చేయూత అందిస్తున్నాం. వేధింపులకు గురి చేస్తున్నా వ్యక్తులు ఎవరైనా ఉపేక్షించేది లేదు.

– రితిరాజ్, ఎస్పీ, గద్వాల

త్వరలోనే ‘పేట’ ప్రజలకు శుభవార్త

- జీఓ 69పై ప్రభుత్వం సమాలోచన
- పాలమూరుకు తీరని అన్యాయం చేశారు
- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి


దామరగిద్దలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

దామరగిద్ద: ప్రజాపాలనకు పట్టం కట్టిన నారాయణపేట ప్రజలు త్వరలోనే శుభవార్త వింటారని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి చెప్పారు. సోమవారం మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సమక్షంలో న్యాయ యాత్రను ప్రారంభించారు. క్యాతన్‌పల్లి, బాపన్‌పల్లి మీదుగా దామరగిద్ద చేరుకుని బహిరంగసభలో వారు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెచ్చిన జీఓ 69 అమలుకు కసరత్తు చేస్తున్నారని, త్వరలోనే పేట, కోడంగల్ ప్రజలు శుభవార్త వింటారన్నారు. పేట –కొడంగల్ ఎత్తిపోతల చేపడితే రూపురేఖలు మారనున్నాయన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ నాయకులు ఓట్ల కోసం వాడుకున్నారే తప్పా అభివృద్ధి కాకుండా అన్యాయం చేశారన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి, రుణమాఫీ, డీడీలు చెల్లించిన కురుమ యాదవులకు గొర్రెల పంపిణీ కాలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించిందన్నారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫికి, ఒకే దరఖాస్తులో ఐదు గ్యారంటీలకు దరఖాస్తు తీసుకున్నారని అర్హులందరికీ పథకాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని గెలిపించుకున్న పట్టుదలతోనే హస్తం గుర్తుకు ఓటేసే ఎంపీని గెలిపిస్తే దేశంలో రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఒకే ప్రభుత్వం ఉంటే అభివృద్ధి సులభం అవుతుందన్నారు. మోదీ పాలనలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడమే తప్పా, దించడం లేదన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు సూటి ప్రశ్నలు

బీఆర్ఎస్ సన్నాహక సమావేశం జరుగుతున్న విషయమై వంశీచంద్‌రెడ్డి సూటి ప్రశ్నలు సంధించారు. ఎంతమంది దళితులకు మూడు ఎకరాల భూమి ఇచ్చారో చెప్పాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో 2లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామన్నారు. ఎన్ని లక్షల ఎకరాలకు నీరందించారో చెప్పాలన్నారు. దళితబంధు పేరుతో ఇచ్చింది తక్కువ నొక్కింది ఎక్కువన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ఎన్ని సీట్లు కేటాయించారో చెప్పాలన్నారు. ప్రజలను మభ్యపెట్టినందుకే కర్రుకాల్చి వాత పెట్టారని, ఇప్పుడు సన్నాహక సమావేశాలకు ముందు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. డీడీలు కట్టించుకున్న గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, మహిళా అధ్యక్షుడు ప్రసన్నారెడ్డి, కుంభం శివకుమార్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఈదప్ప, బస్వరాజ్ తదతరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,019 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,019 అడుగులకు చేరి నిలకడగా కొనసాగుతుంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

ర్యాష్ డ్రైవింగ్‌తో ఇరువురికి గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు కారు ర్యాష్ డ్రైవింగ్ వల్ల ఇరువురికి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బిజినేపల్లి మండలం పాలెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు కుర్మయ్య, మణెమ్మలు ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి జిల్లా కేంద్రానికి బయలుదేరారు. మార్గమధ్యలో హౌజింగ్‌బోర్డు కాలనీకి రాగానే గుర్తుతెలియని కారు ర్యాష్ డ్రైవింగ్ చేసుకుంటూ ఎదురుగా రావడంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇరువురిరు కింద పడి తీవ్రగాయాలయ్యాయి. ఇరువురిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

రేపు చలో పీయూ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం చలో పీయూ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అర్జున్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. పీయూ ఏర్పాటై 15 ఏళ్లు గడుస్తున్నా.. కొత్త కోర్సులు ఏర్పాటు చేయలేదన్నారు. అన్ని కోర్సులను సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులుగా మార్చారని అన్నారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కృష్ణ, జైపాల్, శివకుమార్, వేణుగోపాల్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్‌కు రూ. 147 కోట్లు ఇవ్వండి

- మంత్రి ఉత్తమ్‌ను కోరిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ అధికారులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద అదనంగా మరో 20 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి రూ.147 కోట్లు మంజూరు చేయాలని సోమవారం హైదరాబాద్‌లో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరారు. వివిధ అంశాలపై మంత్రితో పాటు సీఈ రమణారెడ్డి, ఎస్‌ఈ చక్రధర్, ఈఈ ప్రతాప్‌సింగ్, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి చర్చించారు. 2005–6లో కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా ఎత్తిపోతల పథకం ద్వారా కోయిల్‌సాగర్‌కు నీరందించిందని, అయితే కాల్వల పనులు పెండింగ్‌లో ఉండగా బీఆర్ఎస్ పాలకులు పట్టించుకోకపోవడం వల్ల 20వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని మంత్రికి వివరించారు. అలాగే ప్రస్తుత రబీ సీజన్‌లో వేసిన పంటలకు కోయిల్‌సాగర్‌లో ఉన్న నీరు సరిపోని పరిస్థితి ఉందని జూరాల నుంచి అదనంగా 0.75 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి ప్రాజెక్టుకు అందించాలని ఎమ్మెల్యే కోరారు. దీనికి గాను మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాల్వల నిర్మాణం కోసం కావాల్సిన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారని, అలాగే జూరాల నీటిని కోయిల్‌సాగర్‌కు లిఫ్ట్ చేసే విషయంలో కూడా మంత్రి స్పందించారని తెలిపారు.

‘నిలువురాళ్లు’ విద్యా మాసపత్రిక అభినందనీయం


నిలువురాళ్ల విద్యా మాస పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ తదితరులు

నారాయణపేట: ఉపాధ్యాయులు తాము పాఠశాలలో కనబరిచిన విద్యార్థుల సృజనాత్మకత, ఉత్తమ కార్యక్రమాల అంశాలను పేర్కొంటూ రూపొందుతున్న నిలువురాళ్లు విద్యా మాస పత్రిక అభినందనీయమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ చేతుల మీదుగా జిల్లా విద్యాశాఖ విద్యా ప్రగతి స్ఫూర్తిదాయక కథనాలతో నిలువురాళ్ల పేరుతో రూపొందించిన మాస పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మాస పత్రికలో జిల్లా విద్యాశాఖ, ఉపాధ్యాయులందరూ స్పందించి తమ రచనలను, అమూల్యమైన సూచనలను అందజేస్తూ ప్రతినెల విజయవంతంగా విడుదల చేయాలన్నారు. ఈ పత్రిక రచనకు కృషి చేసిన డీఆర్‌సీ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

బోధనా వ్యూహాలతో పాఠశాలలకు చేరవేస్తాం

ఈ సంచికలో పాఠశాల అభివృద్ధి, బాల బాలికల మానసిక వికాసానికి అంశాలు, పాఠశాలల్లో జరుగుతున్న ముఖ్యమైన దినోత్సవాలు, సులభతరమైన బోధన వ్యూహాలు, ఉత్తమ ఫలితాల పాఠశాల వివరాలు, పిల్లల సృజనాత్మక అంశాలు, సూక్తులు క్విజ్ తదితర అంశాలను పొందుపరిచి ప్రతి పాఠశాలలకు చేరవేస్తామని డీఈఓ అబ్దుల్‌ఘని, సంపాదకులు ఏఎంఓ విద్యాసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓలు శ్రీనివాసులు, నాగర్జునరెడ్డి, సీఎంఓ రాజేందర్, సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, నర్సింహారెడ్డి, కృష్ణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నర్సింహ తదితరులుఉన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా


కృత్రిమ ఇసుకను తరలించేందుకు నిలిపిన టిప్పర్

రాజాపూర్: మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినప్పటికీ రాజాపూర్ శివారులోని దుందుబీవాగులో మట్టిని తోడి కృత్రిమ ఇసుకను తయారు చేస్తూ రాత్రివేళల్లో టిప్పర్ల ద్వారా పట్టణాలకు పట్టణాలకు తరలిస్తున్నారు. రాయపల్లి, రాజాపూర్ శివార్ల మధ్య దుందుబీవాగులో ఇసుక మాఫియా రెండు రోజుల క్రితం ఏకంగా ఓ భారీ పొక్లెయినర్‌తో రహదారిని కూడ సిద్ధం చేసుకున్నారు. అధికారుల అండదండలు లేకుండా ఈ వ్యాపారం సాగుతుందా అంటు శివారు రైతులు ఆరోపిస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని

నవాబుపేట: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలకేంద్రంలోని కేజీబీవీ విద్యార్థిని సంధ్య ఎంపికైంది. ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ ఈనెల 7నుంచి రాజస్థాన్‌లో జరిగే పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు. సోమవారం పాఠశాలలో సంధ్యను అభినందించారు. పీఈటీ అర్చన తదితరులు పాల్గొన్నారు.



బీసీలకు 8 సీట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న కృష్ణయాదవ్

జడ్చర్ల టౌన్: ఎన్నికల ప్రచారసభల్లో బీసీ డిక్లరేషన్ ప్రకటించినట్లుగానే ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో సామాజిక న్యాయం పాటిస్తూ బీసీలకు రూ.20వేలకోట్లతో ప్రత్యేక బడ్జెట్ పెట్టాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులవృత్తుల వారికి వంద శాతం సబ్సిడీతో ఆర్థికసాయం చేయాలన్నారు. బీసీ కులగణన చేయటాన్ని స్వాగతిస్తున్నామని, అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు హామీ నెరవేర్చాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 8 స్థానాలు కేటాయించాలని కోరారు. బీసీలకు పెద్దపీట వేసే పార్టీకి పూర్తి మద్దతు ప్రకటిస్తామన్నారు. సమావేశంలో నిరంజన్, వెంకటేష్, నర్సింహులు, విజయ్‌కుమార్, రామస్వామి, గోపాల్, రఘు పాల్గొన్నారు.